## క్లుప్తంగా

### కాంప్లెక్స్ పనుల పరిశీలన



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన కోనేరు వద్ద చేపట్టిన గదులు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుర్గేష్‌కుమార్, ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాద రావుతో కలసి గురువారం పరిశీలించారు. దుర్గేష్‌కుమార్ మాట్లాడుతూ.. రూ.2.70 కోట్లతో కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతోందని, కేశఖండనశాల, టాయ్‌లెట్స్ నిర్మాణానికి మరో రూ.కోటి సీజీఎఫ్ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కేశఖండన, టాయ్‌లెట్స్ నిర్మాణానికి అనువైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. డీఈ డి.గోపాలకృష్ణయ్య, ఏఈ డి.ఎన్.కుమార్ పాల్గొన్నారు.

### కల్యాణం.. కమనీయం



కృత్తివెన్ను: శివరాత్రిని పురస్కరించుకుని కృత్తివెన్నులో కొలువై ఉన్న శ్రీ దుర్గాపార్వతి సమేత నాగేశ్వరస్వామి దివ్యకల్యాణం బుధవారం రాత్రి కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై పరమేశ్వర పార్వతీదేవి, శ్రీ రమాసహిత వీరవెంకటసత్యనారాయణస్వామి వార్ల కల్యాణం జరిపించారు. ఒకే వేదికపై శివకేశవులకు కల్యాణాలు జరపడం అరుదైన విషయమని అర్చకుడు మురళీకృష్ణ తెలిపారు. ఆలయ ఈఓ సింగనపల్లి శ్రీనివాసరావు దంపతులు, చిలుకూరి చంద్రశేఖర్ దంపతులు కల్యాణాన్ని జరిపించారు.

### కనులపండువగా సోమేశ్వరస్వామి కల్యాణం



చల్లపల్లి: మండలంలోని లక్ష్మీపురంలో వేంచేసిన శ్రీదుర్గాపార్వతి సమేత శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ నెల 25వ తేదీన నుంచి నాలుగురోజు నుంచి కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్న విషయం విదితమే. ఆలయ ప్రధాన అర్చకులు భమిడిపాటి బాలసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కల్యాణోత్సవంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### వైభవంగా ప్రభోత్సవం



బంటుమిల్లి: మండలంలోని నాగన్నచెరువులో శివరాత్రిని పురస్కరించుకుని ప్రభోత్సవం వైభంగా జరిగింది. 35 ఏళ్లుగా మహాశివరాత్రి కమిటీ పర్యవేక్షణలో రంగురంగుల పూలు, దేవుడి చిత్రపటాలు, పూలదండలతో మడత ప్రభ నిర్మించి ఐదు రోజులపాటు ఉత్సవాలు చేస్తారు. శివరాత్రి ముందురోజు నుంచి ప్రభను ట్రాక్టరుపై ఉంచి మేళతాళాలు, టపాసులు, యువకుల నృత్యాలతో ఊరేగింపుగా కలిదిండి మండలంలోని శ్రీపార్వతి సమేత పాతాళభోగేశ్వరస్వామి ఆలయానికి ప్రభను తీసుకెళ్తారు. స్వామి ముందు ప్రభను ప్రదర్శించిన అనంతరం శివరాత్రి తర్వాత రోజు గ్రామంలోకి తీసుకొచ్చి ఐదో రోజు అన్న సమారాధన నిర్వహిస్తారు.

### తరకటూరులో గడ్డివామి దగ్ధం



గూడూరు: మండలంలోని తరకటూరులో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు దేవరపల్లి సురేష్‌కు చెందిన గడ్డివామి దగ్ధమైంది. రోడ్డు పక్కన ఉన్న గడ్డివామి నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గడ్డి మొత్తం అగ్నికి ఆహుతైంది. ప్రమాద సమాచారం అందుకున్న మచిలీపట్నం అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది.

### సమతుల ఆహారంపై శిక్షణ

ఘంటసాల: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గ్రామంలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులకు సమతుల ఆహారంపై గురువారం శిక్షణ ఇచ్చారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి సమతుల ఆహారం ప్రాధాన్యతను వివరించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ జి.కృష్ణవేణి వివిధ ఆహార పిరమిడ్, కౌమర దశలో ఉన్న వారికి పోషకాహార అవసరాలు, హైదరాబాద్‌కు చెందిన జాతీయ పోషకాహార సంస్థ సిఫార్సు చేసిన రోజువారీ ఆహారంపై అవగాహన కల్పించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త కె.రేవతి, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

- అవనిగడ్డ నియోజకవర్గంలో 68.91 శాతం పోలింగ్
- మోపిదేవిలో అత్యధికంగా 73.27 శాతం
- అవనిగడ్డలో ఓటు వేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



కోడూరులో పోలింగ్ బూత్ వద్ద క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లు

అవనిగడ్డ: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు అవనిగడ్డ నియోజకవర్గంలో గురువారం ప్రశాంతంగా జరిగాయి. అవనిగడ్డ మండలంలో మొత్తం 2,027 మంది ఓటర్లు ఉన్నారు. 1,421 మంది ఓటరు వేయడంతో 68.41 శాతం పోలింగ్ నమోదైంది. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అవనిగడ్డలో ఓటు హక్కుని వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 9,024 మంది ఓటర్లు ఉండగా 6,219 మంది ఓటు వేశారు. 68.91 శాతం పోలింగ్ నమోదైంది. మోపిదేవి మండలంలో అత్యధికంగా 73.27 శాతం, నాగాయలంకలో అత్యల్పంగా 65.66 శాతం పోలింగ్ నమోదైంది. నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించారు.

**పోలింగ్ కేంద్రం పక్కనే ఫ్లెక్సీ**

అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రానికి 50 అడుగుల లోపే రహదారి పక్కన కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఫ్లెక్సీ ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. ఈ కేంద్రంలో రెండు పోలింగ్ బూత్‌ల పరిధిలో 2077 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రచార ఫ్లెక్సీ పెట్టినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు చోట్ల ఓటర్లకు డబ్బులు పంచడం, కోడూరులో ఓ ఉపాధ్యాయుడి ఓటు మరొకరు వేయడం వంటి ఘటనలు జరగడంపై డీఎస్పీ విద్యశ్రీకి సీపీఎం నాయకుడు ఆవుల బసవయ్య ఫిర్యాదు చేశారు.

**పోలింగ్ కేంద్రాల పరిశీలన**

మోపిదేవి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. 191 బూత్‌లో 551 మంది, 192 బూత్‌లో 321 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1,190 మంది ఓటర్లకు 872 మంది ఓట్లు వేయడంతో 73.27 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారులు కె.హెప్సిబారాణి, కె.అనూరాధ తెలిపారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, అడిషినల్ ఎస్పీ సత్యానారాయణ, మెప్మా పీడీ, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు పెనుమూడి సాయిబాబు, అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. చల్లపల్లి సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ సత్యనారాయణ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

**కోడూరులో 65.96 శాతం పోలింగ్**

కోడూరు: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియం వెనుక భాగంలో ఉన్న స్త్రీశక్తి భవనం (195 పోలింగ్ బూత్), ఉర్దూ పాఠశాల (196 పోలింగ్ బూత్)లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 1416 మంది ఓటర్లకు 934 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓటింగ్ మందకొడిగా సాగింది. ఆ తరువాత ఊపందుకుంది. పోలింగ్ ముగిసే సమయానికి 65.96 శాతం నమోదైందని తహసీల్దార్ శ్రీనునాయక్ తెలిపారు. పోలింగ్ సరళిని అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ, సీఐ యువకుమార్ పరిశీలించారు. ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఎస్ఐ చాణిక్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**నాగాయలంకలో 65.66 శాతం పోలింగ్**

నాగాయలంక: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నాగాయలంక జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో ప్రశాంతంగా ముగిసింది. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1100 మంది ఉండగా ఉదయం పది గంటలకు కేవలం 117 మందే ఓటు వేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు 50 శాతం, పోలింగ్ ముగిసే సమయానికి 767 మంది ఓటు వేయడంతో 65.66 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల ఏఆర్‌ఓగా వ్యవహరించిన తహసీల్దార్ ఎం.హరనాథ్, డెప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రఫీ పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షించారు. అవనిగడ్డ సీఐ యువకుమార్ పర్యవేక్షణలో నాగాయలంక ఎస్ఐ కలిదిండి రాజేష్ బందోబస్తు నిర్వహించారు.



తహసీల్దార్ విజయ ప్రసాద్‌ను అడిగి ఓటింగ్ వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ విద్యశ్రీ

**ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం**

చల్లపల్లి: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో మొత్తం 2,024 మంది ఓటర్లు ఉండగా 1,416 మంది ఓటు వేశారు. చల్లపల్లి ఎస్ఆర్‌వైఎస్పీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 189, 190 పోలింగ్ కేంద్రాల్లో 69.96 శాతం పోలింగ్ నమోదైందని ఇన్‌చార్జి తహసీల్దార్ జి.శ్రీలత తెలిపారు. తహసీల్దార్, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, బూత్ లెవల్ ఆఫీసర్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది ఎన్నికల ఏర్పాట్లన పరిశీలించారు. ఏఆర్ ఎడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం ఎన్నికల బందోబస్తును పర్యవేక్షించారు.

**ఘంటసాల మండలంలో 66.39 శాతం**

ఘంటసాల: మండలంలో గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన 166, 166ఏ పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మండలంలో 1217 మంది ఓటర్లు ఉండగా 808 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 66.39 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు కూటమి నేతలు ప్రయత్నాలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీఐ ప్రసాద్, ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో బందో బస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ విద్యశ్రీ, ఆర్ అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ పరిశీలించారు.



అవనిగడ్డలో పోలింగ్ కేంద్రం పక్కనే ఉన్న కూటమి అభ్యర్థి ఫ్లెక్సీ



అవనిగడ్డలో ఓటు వేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



మోపిదేవిలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

# మచిలీపట్నంలో 67.62 శాతం నమోదు

- ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం
- ఓటు వేసిన మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, బందరు ఆర్డీఓ స్వాతి
- హిందూ కాలేజీ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న పేర్ని కిట్టు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో గురువారం పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మచిలీపట్నంలో నాలుగు కేంద్రాల్లో 12 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. 67.62 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గ పరిధిలో 10,070 మంది ఓటర్లు ఉండగా 6,810 మంది ఓటు వేశారు. 3,719 మంది పురుషులు, 3,091 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సిబ్బంది గురువారం ఉదయం నోబుల్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటరు నుంచి పోలింగ్ మెటీరియల్‌ను స్వీకరించి ఆయా పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా చేరుకున్నారు. ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. హిందూ కళాశాల, హైనీ హైస్కూల్, సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్, జైహింద్ హైస్కూల్‌లో 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.



మచిలీపట్నంలో హిందూ కాలేజీలో ఓటు వేసేందుకు బారులుతీరిన పట్టభద్రులు

**ఓటు హక్కు వేసిన ప్రముఖులు**



ఓటు వేసిన బందరు ఆర్డీఓ స్వాతి

నగరంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉదయం నుంచి ఓటర్లు బారులుతీరి ఉన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారు సైతం ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. హైనీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ డి.కె.బాలాజీ, బందరు ఆర్డీఓ కె.స్వాతి ఓటు వేశారు. హిందూ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యంగా యువతులతో పాటు గర్భిణులు, చిన్న పిల్లలతో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవటం కనిపించింది. పోలింగ్ కేంద్రాల వద్ద పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు, కూటమి పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సంబంధించిన శిబిరాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే ఓటర్లను ప్రలోభ పెట్టేలా కూటమి నాయకులు వ్యవహరించారు.



మచిలీపట్నంలో హిందూ కాలేజీ బూత్‌లో ఓటు వేస్తున్న పేర్ని కిట్టు

## డ్వాక్రా మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఘంటసాల: డ్వాక్రా మహిళలకు యూనియన్ బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ కె.వెంకట్రావు సూచించారు. ఘంటసాల వెలుగు కార్యాలయంలో ఘంటసాల, చల్లపల్లి మండలాలకు చెందిన డ్వాక్రా మహిళలకు మెగా ఎస్‌హెచ్‌జీ మేళా, రుణ అవగాహన సదస్సు ఘంటసాల యూనియన్ బ్యాంకు మేనేజర్ ఎన్.లోవరాజు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా రీజనల్ హెడ్ వెంకట్రావు, డెప్యూటీ రీజనల్ హెడ్ వి.ఆర్.ఎం.తాతాజీ మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంకు డ్వాక్రా మహిళలకు అందిస్తున్న రుణ సదుపాయాలపై అవగాహన కల్పించారు. ప్రైవేటు సంస్థల బారినపడి నష్టపోవద్దని సూచించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే బ్యాంకులు మరింత తోడ్పాటు అందిస్తాయన్నారు. అనంతరం ఘంటసాల, చల్లపల్లి మండలాలకు చెందిన పలు గ్రూపులకు రుణ మంజూరు పత్రాలను వెంకట్రావు, తాతాజీ ఆయా బ్రాంచ్ మేనేజర్లతో అందించారు. వెంకట్రావు, తాతాజీ, ఏపీఎం శ్రీనివాసరావు, సమాఖ్య ప్రెసిడెంట్ పార్వతిని సిబ్బంది సన్మానించారు.



మహిళలకు రుణ మంజూరు పత్రాలు అందిస్తున్న యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ వెంకట్రావు

ముందుగా ఘంటసాల వెలుగు కార్యాలయానికి యూనియన్ బ్యాంకు తరఫున అందించిన వాటర్ డిస్పెన్సరీని ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు రీజనల్ ఆఫీస్ అధికారులు చంద్రశేఖర్, కార్తీక్, చల్లపల్లి, కొడాలి, శ్రీకాకుళం బ్రాంచి మేనేజర్లు వెంకట్రావు, రవివర్మ, హరీష్, చల్లపల్లి, ఘంటసాల ఏపీఎంలు శ్రీనివాసరావు, పాండురంగ ప్రసాద్, ఘంటసాల సీసీలు ఝాన్సీరాణి, వెంకట నర్సమ్మ, నాగేశ్వరమ్మ, చల్లపల్లి సీసీ నిర్మల, ఎంఎస్ ప్రెసిడెంట్ పార్వతి పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

- పెడన నియోజకవర్గంలో 76.6 శాతం పోలింగ్ నమోదు
- దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లకు నగదు అందజేసిన తమ్ముళ్లు
- సాయంత్రం 4 గంటల తరువాతా పెడనలో కొనసాగిన పోలింగ్

పెడన: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ కేంద్రానికి వెళ్లే మార్గంలో ఉదయం నుంచే తమ్ముళ్లు అల్పాహారం, తేనీటి విందు, మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. ఓటేయడానికి వెళ్లే వారిని పలుకరిస్తూ ఓటరు స్లిప్పులు తీసుకుని దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి రూ.2 వేల చొప్పున అందజేశారు. దూర ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తున్న వారికి చార్జీలంటూ టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు రూ.2 వేల చొప్పున పెడన రూరల్ ప్రాంతంలో పంపిణీ చేశారు. స్థానికంగా ఉన్న ఓటర్లు కొందరు తమకెందుకు ఇవ్వడం లేదంటూ టీడీపీ, జనసేన నాయకులను పలుచోట్ల నిలదీశారు.

**3,430 మంది ఓటు హక్కు వినియోగం**

పెడన నియోజకవర్గంలో 4,471 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3,430 మంది ఓటు వేశారు. పురుషులు 2,103 మంది, మహిళలు 1,327 మంది ఓటు వేయడంతో పోలింగ్ 76.6 శాతంగా నమోదైంది. పెడన భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీహెచ్‌ఎస్‌లో 171, 172 నంబరు బూత్‌లు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 1,389 మంది ఓటర్లు ఉండగా 1,127 మంది ఓటు వేశారు. బంటుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని రెండు బూత్‌లలో 1,321 మందికి గాను 981 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గూడూరు మండలం గూడూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 946 మందికి 723 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.



పెడన 172వ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు



బంటుమిల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న పెడన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ దంపతులు

**సమయం దాటిన తరువాత వచ్చి వెనుదిరిగిన ఓటర్లు**

పెడనలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి గురువారం సాయంత్రం నాలుగు గంటల తరువాత పలువురు ఓటర్లు వచ్చారు. అప్పటికే ప్రధాన గేటు మూసివేయడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. సెల్‌ఫోన్లను అనుమతించకవడంతో ప్రత్యేకంగా రెవెన్యూ సిబ్బందిని ఉంచి సెల్‌ఫోన్లను వారి వద్ద ఉంచి ఓటేయడానికి పట్టభద్రులు లోపలకు వెళ్లారు. పట్టభద్రులైన భార్యాభర్తలు ఓటేయడానికి చంటిపిల్లలతో రావడం విశేషం. ఆయా మండలాల తహసీల్దార్లు, పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జుల పర్యవేక్షణలో బ్యాలెట్ బాక్సులను జిల్లాకేంద్రమైన మచిలీపట్నం తరలించారు.

## శ్రీరామపాదక్షేత్రంలో వైభవంగా శివకల్యాణం



శ్రీరామ పాదక్షేత్రంలో శ్రీరామలింగేశ్వరస్వామికి స్వీయ అభిషేకాలు చేస్తున్న భక్తులు

నాగాయలంక: మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం అర్ధరాత్రి రెండు గంటల వరకు లింగోద్భవకాల అభిషేకాలను మండలంలోని నాగాయలంక, సంగమేశ్వరం శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరీ సమన్విత పార్వతీ సమేత నగరేశ్వరస్వామి ఆలయంలో నగరేశ్వరునికి గంధం, అన్నం, పలురకాల పండ్లు, విభూది, చక్కెర, పంచామృతం తదితర 11 రకాల ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్ర అభిషేకాలను కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకుడు కొల్లిపర సుబ్బారావు బృందం నిర్వహించింది. కృష్ణానది ఒడ్డున శ్రీరామ పాదక్షేత్రం పుష్కర ఘాట్‌లోని శ్రీరామలింగేశ్వరస్వామి మండపం వద్ద తెల్లవారు జామున రెండు గంటల వరకు శివపార్వతుల కల్యాణం కనులపండువగా సాగింది. దీవి ఫణి కృష్ణమాచార్యులు, ముదునూరు శ్రీనివాసశాస్త్రి నేతృత్వంలో వేద పండితులు ఈ వేడుకను జరిపించారు. దాత కంఠంనేని ప్రేమ్‌చంద్, క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పూజలు చేశారు. తొలుత శ్రీరామలింగేశ్వర శివలింగానికి, నందీశ్వరునికి భక్తులు స్వీయ అభిషేకాలు జరిపారు. మండలంలోని సంగమేశ్వరంలోని శ్రీగంగా పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో స్వామి దివ్యకల్యాణ మహోత్సవం శోభాయమానంగా జరిగింది. భావదేవరపల్లిలో శ్రీకాశీవిశ్వేశ్వరస్వామికి లింగోద్భవకాల అభిషేకాలు, అన్నపూర్ణ దేవికి మహిళలు మణిద్వీపవర్ణన సామూహిక పారాయణం జరిపారు. శ్రీరామ పాద క్షేత్రం ఘాట్‌లో బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన ఆధ్యాత్మికవేత్త తోట శంకర్ గురుస్వామి శివతత్వం–మానవాళి జీవిత సత్యాలుపై ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించారు.



నాగాయలంక కన్యకాంబ ఆలయంలో శ్రీనగరేశ్వరస్వామికి చక్కెర అభిషేకం

## శైవక్షేత్రాల్లో లింగోద్భవ పూజలు



హంసలదీవిలో లింగాకారుడికి అభిషేకాలు చేస్తున్న పండితులు



ప్రత్యేక అలంకారంలో లింగారెడ్డిపాలెం గోకర్ణేశ్వరుడు

కోడూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం అర్ధరాత్రి తరువాత శైవక్షేత్రాల్లో లింగోద్భవ పూజలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామి మూలమూర్తికి పండితులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేశారు. హంసలదీవి కాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో లింగోద్భవ పూజలు ఘనంగా జరిగాయి. ఉల్లిపాలెంలోని కైవల్యానంద స్వామిజీ ఆశ్రమం వద్ద ఉన్న శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రెండు వేల మందిక అన్నసమారాధన నిర్వహించారు. విశ్వనాథపల్లి కాశీవిశ్వేశ్వరస్వామి, సాలెంపాలెం అగస్త్యేశ్వరస్వామి, మాచవరం రామేశ్వరస్వామి, పిట్టల్లంక బాలనాగేశ్వరస్వామివారి ఆలయంలో కూడా బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ పూజలను నిర్వహించారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు



ఘంటసాల: మహాశివరాత్రి సందర్భంగా ఘంటసాల గ్రామంలో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన మహిళా అర్చకులు ఘంటసాల విజయలక్ష్మి, ఘంటసాల మాధవీలత ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి వార్ల గ్రామోత్సవం మేళ తాళాల మధ్య ఘనంగా జరిగింది. స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో రిటైర్డ్ హెచ్‌ఎం పోతన వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చల్లపల్లికి చెందిన మెహర్ నృత్యాలయం నిర్వాహకులు దాలిపర్తి మెహర్ నరసింహారావు శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ వేమూరి శివరామకృష్ణ, స్వచ్ఛ ఘంటసాల ప్రతినిధులు గొర్రెపాటి సురేష్, ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.